
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
బుధవారం 23 అక్టోబరు 2024

కారుతో ఢీ కొట్టి.. కత్తితో పొడిచి..

- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడి దారుణ హత్య
- కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ధర్నా పాల్గొన్న ప్రభుత్వ విప్

6


ధర్నాలో పోలీసులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

భూ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ సత్యప్రసాద్


చెర్లకొండపూర్‌లో భూసర్వే పనుల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

8

చారిత్రక ఖిల్లా..

- టూరిజం మ్యాప్‌లో మెరిసే నక్షత్రం
- ఐరోపా కోటతో పోలికలు
- రాష్ట్రంలోని నక్షత్రాకార కోట
- పర్యాటక శాఖ ఆదరిస్తే మరింత గుర్తింపు


ఖిల్లా ఆవరణలో గల ఫిరంగులు

7

కల్తీ జోరు



- ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించని నిర్వాహకులు
- ఆకర్షణ కోసం రంగుల వినియోగం
- పలుమార్లు వాడిన నూనెతో వంటకాలు
- మాంసం నిల్వలో నిబంధనలు తూచ్
- కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు

జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పలు ఆహార పదార్థాల్లో హానికర రంగులు, పలుమార్లు వాడిన నూనెతో వంటకాలు మాంసం నిల్వ, తదితరాలు జగిత్యాల జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో వెలుగుచూస్తున్నాయి. కల్తీ ఆహారంతో వ్యాపారం చేస్తూ కొందరు జేబులు నింపుకొంటున్నారు. ఫలితంగా ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది. ఆసుపత్రిల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కూరగాయలను కడగకుండానే వాడుతుండటంతో వాటిపై ఉన్న పురుగుమందుల అవశేషాలు ఆహార పదార్థాలలో కలుస్తున్నాయి. ఇక బిర్యానీ, కబాబ్, గోబీ మంచూరియా, కొన్ని రకాల మిఠాయిల ఆకర్షణ కోసం సింథటిక్ రంగులు కలుపుతున్నారు. వాటి ప్రభావం జీర్ణక్రియ, నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. మరోవైపు ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్‌లలో ప్యాకింగ్ చేస్తూ ప్రజారోగ్యాన్ని మరింత దెబ్బతిస్తున్నారు. ఆహార భద్రతా అధికారులు పలు పర్యాయాలు సోదాలు జరిపి కేసులు నమోదు చేస్తున్న వ్యాపారుల తీరు మారడం లేదు.

వాడిన నూనె పదేపదే...

ఒకసారి వినియోగించిన నూనెను వంటకాల్లో వాడటం ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదని నిపుణులు అంటున్నారు. ప్రధానంగా కబాబ్, బజ్జీ, జిలేబీల తయారీలో నూనెలను అనేకసార్లు వాడుతున్నారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వద్ద టోటల్ షోలార్ కాంపొనెంట్స్ (టీపీసీ) పరికరాలు ఉంటాయి. తనిఖీకి వెళ్లినపుడు మరగబెడుతున్న నూనెలో పరికరాన్ని ముంచితే వినియోగానికి పనికి వస్తుందా లేదా అనేది తెలిసిపోతుంది. ఆహార పదార్థాలు తయారీకి ఉపయోగించే వంట నూనెలో పలు వ్యత్యాసాలుంటున్నాయి. ఒక లీటరు నూనెను రెండు, మూడుసార్లు కంటే ఎక్కువగా మరిగించకూడదని నిపుణులు అంటున్నారు. అంతకు మించి మరిగిస్తే అందులో ఉండే టోల్ పోలార్ కాంపొనెంట్స్(టీపీసీ) ఫ్రీరాడికల్స్‌గా మారుతోందని అధికారులు చెబుతున్నారు. అధికారులు టీపీసీ మీటర్‌తో పరిశీలించినప్పుడు నూనెలో 25శాతం మించి ఉండకూడదు. పలు హోటళ్లలో ఈ టీపీసీ 50 నుంచి 75 శాతం చూపిస్తుందన్న ఆరోపణలున్నాయి. ఫుడ్‌కోర్టుల నుంచి రెస్టారెంట్లు, హోటళ్ల వరకు ఇదే తంతు కొన సాగుతోంది.

తరువాయి 8వ పేజీలో..

మహాసభలను జయప్రదం చేయండి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నవంబరు 10వ తేదీన కోరుట్ల పట్టణంలో జరిగే సీపీఎం జగిత్యాల జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పుప్పాల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం జగిత్యాల పట్టణంలో సీపీఎం మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, రైతు, విద్యార్థి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎం జిల్లా అధ్యక్షుడు ఎంఏ చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ గుగులోతు తిరుపతి నాయక్, గర్వందుల రమేష్, వెంకట చారి, చంద్రయ్య, మల్యాల సురేష్, మహిపాల్, రఫిక్, విజయ్ పాల్గొన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణను పరిశీలించిన అదనపు కలెక్టర్



ప్లాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో ప్లాట్ల క్రమబద్ధీకరణ నిమిత్తం జరుగుతున్న ఫీల్డ్ వెరిఫికేషన్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు కాకుండా ప్లాట్లను క్రమబద్ధీ కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ 63 భూ సేకరణపై సమీక్ష

జగిత్యాల అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్‌హెచ్(ఓ) కింద హైబ్రీడ్ జాన్యుటి విధానంలో ఆర్మూర్ నుంచి మంచిర్యాల ఇంటర్ కారిడార్ ఎన్‌హెచ్ 63 నాలుగు వరుసల రహదారిపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల సెక్షన్ భూసేకరణ స్థితిగతులపై టీ ఆర్‌అండ్ బీ ప్రత్యే కాధికారి గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నేడు అదనపు తరగతుల నిర్మాణానికి భూమిపూజ

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 22: పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రూ. 4కోట్ల కేంద్ర, రాష్ట్ర నిధులతో నిర్మాణం చేపట్టనున్న 12 అదనపు తరగతుల నిర్మాణం కోసం ఉదయం 10:30 గంటలకు భూమి పూజ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. కలెక్టర్‌తో పాటు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు.

గంగారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ


అంతిమయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ లక్ష్మణకుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, అక్టోబరు 22 : జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో మంగళవారం ఉదయం హత్యకు గురైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మారు గంగారెడ్డి అంత్యక్రియల్లో ప్రభుత్వవిప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలు పాల్గొన్నారు. గంగారెడ్డి పార్థీవ దేహానికి నివాళులు అర్పించి తమ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చిరు. అనంతరం వారు మాట్లాడుతూ గంగారెడ్డి మృతి చాలా బాధాకరమని, వారి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించినట్లు వారు తెలిపారు.

కుష్ఠు వ్యాధి పెరగకుండా జాగ్రత్తలు వహించాలి


సమీక్ష నిర్వహిస్తున్న వైద్యాధికారిణి శిరీష

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠు కేసులు పెరగకుండా అవరమైన జాగ్రత్తలు వహించాలని నెగ్లెక్టెడ్ ట్రాపికల్ డిసీజెస్ జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీష అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వైద్యులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డెంగ్యూ, చికెన్ గన్యా, లిస్మోనియాసిస్, లెప్రసి, లింపాటిక్ ఫైలేరియాస్ తదితర వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్


ఆసుపత్రిలో విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు నిబంధనలు విస్మరిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బ్రైట్ ప్రైవేటు ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన డాక్యుమెంట్, ప్రస్తుతం అందుబాటులో ఉన్న డాక్టర్లు, సిబ్బంది తదితర వివరాలను పరిశీలించారు. అనుమతించిన విధంగా పరిమితులకు లోబడి సేవలు అందించాలన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన సమాచారం ప్రకారం కాకుండా కొత్త వైద్యులు, సిబ్బందిని చేర్చు కున్నప్పటికీ వైద్య ఆరోగ్య శాఖకు సమాచారాం ఇవ్వకపోవడం, అనుమతులు తీసుకోకపోవడం నేరమన్నారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు మహిళా ఉద్యోగినులకు వేధింపులు ?

కలెక్టర్‌కు గోడు వెళ్లబోసుకున్న బాధితులు?

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఇద్దరు మహిళా అధికారిణులకు ఒక ఉన్నతాధికారి వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు ఉన్నతాధికారి వేధింపులు భరించలేక బాధిత మహిళా ఉద్యోగినులు మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చి కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నట్లు సమాచారం. స్థానిక సంస్థకు చెందిన సంబంధిత ప్రభుత్వ కార్యాలయంలో కీలకమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్న బాధిత మహిళా ఉద్యోగినులకు ఇటీవల అకారణంగా మెమో జారీ చేశారని, సంబంధిత మెమోకు సమాధానం అందించినప్పటికీ మరోమారు ఇంకో మెమో పంపి వేధిస్తున్నాడని వాపోయినట్లు తెలుస్తోంది. సదరు అధికారి వేధింపుల నుంచి రక్షించాలని కలెక్టర్‌ను వేడుకున్నట్లు తెలుస్తోంది.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


మల్యాలలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరలు పొందాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని రామన్నపేట, ముత్యంపేట, మల్యాల, బల్వంతాపూర్‌లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, ఏఎంసీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరీశ్రీనివాస్‌గౌడ్, వైండో చైర్మన్ రాంలింగారెడ్డి మార్కెట్ డైరెక్టర్లు జలంధర్, కొలకాని మారుతి నాయకులు పాల్గొన్నారు

పెండింగ్ బిల్లుల కోసం ఉపాధ్యాయుల నిరసన

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర సహాధ్యక్షుడు నరేంధర్‌రావు, జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్యలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యా యులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలచే నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ అవసరాల నిమిత్తం దాచుకున్న జీపీఎఫ్ మొత్తం సంపాదిత సెలవు మొత్తం మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సప్లిమెంటరీ వేతనాల బిల్లులు ఏడాది కాలం దాటినా మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఐదు డీఏలు పెండింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ సంఘ బాధ్యులు రాజేంద్రప్రసాద్, మహిపాల్ రెడ్డి, శ్రీధర్, రామకృష్ణ, సురేందర్, సాయిని శ్రీనివాస్, కొల్మూల శ్రీనివాస్, గంగాధర్, రమేష్, రాజేందర్, రాజేశ్వర్ రావు, రమేష్, రామకృష్ణ, దేవరకొండ శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్ : రాయికల్ మండలం మైతాపూర్, మూటపెల్లి గ్రామాల్లోని పాఠశాలతో పాటు మండలంలోని పలు ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. రాయికల్ పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చే శారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే అందించాలని కోరారు. ప్రభుత్వం పీఆర్‌సీని ప్రకటించి బకాయి బిల్లులను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యుడు చెరుకు మహేశ్వర శర్మ, ప్రధానోపాధ్యాయులు కాపు శ్రీనివాస్, రమేష్, నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కొడిమ్యాల: ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీలో ఓటు హక్కు కలిపించాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకటరమణరావు కోరారు. మంగళవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో టీపీయుఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల ప్రధాన కార్యదర్శి ఏనుగు ఆదిరెడ్డి, మండల బాధ్యులు గుడి భూపతిరెడ్డి, బొమ్మ సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


అనూషను సన్మానిస్తున్న గ్రామస్థులు, ఉపాధ్యాయులు

మల్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట జడ్పీఉన్నత పాఠశాలకు చెందిన సంకుర్తి అనూష జిల్లా స్థాయి కళోత్సవాలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయింది. పదవ తరగతి చదువుతున్న అనూష తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ ఏకపాత్రాభినయాన్ని ప్రదర్శించి ప్రతిభ కనబరిచింది. దీంతో మంగళవారం పాఠశాలలో గ్రామస్తులు బొడిగె సురేశ్, కోరుట్ల రవి, రియాజ్, మహిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రథమంగా నిలువాలని అభిలాషించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని.. ఏఐఎస్ఎఫ్ ఆందోళన

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ధర్నా చేశారు. సుమారు గంట పాటు బైఠాయించారు. ఫ్లెక్సీలు, ప్లకార్డుల ప్రదర్శన చేస్తూ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట ఒక తీరు పని మరో తీరుగా వ్యవహరిస్తు న్నారని ఆరోపించారు. ఈనెల 27వ తేదీలోపు ఫీజు బకా యిలను విడుదల చేయకుంటే చలో ఇందిరాపార్క్ కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. వేలాది మంది విద్యార్థులను హైద్రాబాద్ నగరాన్ని దిగ్బంధం చేస్తామన్నారు. సకాలంలో ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రైవేటు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అక్రమ్ మాలిక్, బచ్చల రమేశ్, మచ్చ నితిన్, మంద రాకేశ్, రాజేశ్, వేణు, ప్రణయ్, నరేశ్, అరవింద్, నాగలక్ష్మీ, సౌమ్య చ శిరీష, పర్హాన్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు, విద్యార్థులు





ఆయిల్‌పామ్ తోటలు మెట్ట రైతుకు వరంగా మారనున్నాయి, తక్కువ పెట్టుబడితో, తక్కువ నీటితో ఈ పంట సాగు చేయవచ్చు. మరోవైపు అంతరపంటగా ఇతర పంటలు సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చు. చిగురుమామిడి లో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ నర్సరీ నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మొక్కలు సరఫరా చేస్తున్నారు.

చిగురుమామిడి నర్సరీలో పెరుగుతున్న ఆయిల్ పామ్ మొక్కలు

మెట్ట రైతుకు వరం.. ఆయిల్‌పామ్ తోటలు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి
- అంతర పంటలతో అదనపు ఆదాయం
- చిగురుమామిడి నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కలు

చిగురుమామిడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పంట వేయాలన్నా కోతుల బెడద తీవ్రంగా ఉన్నది. దీంతో రైతులు వరి పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు కొరత ఏర్పడినపుడు వరి పంట ఎండిపోయి తీవ్రంగా నష్టం జరుగుతోంది. ముఖ్యంగా యాసంగి సాగులో రైతులు సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు ఎండిపోయి పెట్టుబడి నష్టపోతున్నారు. మెట్ట రైతులకు అనుకూలంగా ఉండేందుకు ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. కొందరు రైతు పంట సాగుకు ముందుకు వస్తున్నారు.

● ఎకరంలో 57 మొక్కలు

ఎకరానికి 57 మొక్కలు నాటవచ్చు. ఎకరం వరి పంటకు కావాల్సిన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ తోట సాగుచేయవచ్చు. తక్కువ కూలీల ఖర్చు ఉంటుంది. ఆయిల్ పామ్ సాగుచేస్తున్న తోటలో అంతర పంటలు వేసుకుంటున్న రైతులకు ఎరువులకు, ఇతర ఖర్చులకు సంవత్సరానికి 4,200 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఎకరంలో 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెపుతున్నారు. గతంలో టన్ను ధర 14,000 రూపాయలు ఉండేది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అయిల్ పామ్ తోటలకు ప్రోత్సాహం ఇస్తూ టన్ను ధర 17,000 రూపాయలకు పెంచింది.

● సబ్సిడీపై డ్రిప్ పంపిణీ

గత ప్రభుత్వంలో పామాయిల్ సాగుకు సబ్సిడీపై డ్రిప్ ఇవ్వలేదు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు వందశాతం సబ్సిడీతో డ్రిప్ అందిస్తున్నారు. బీసీ ఇతర సామాజిక వర్గాలకు 90శాతం సబ్సిడీపై డ్రిప్ ఇస్తున్నారు. ప్రతి రైతు 20 రూపాయాలతో ఒక మొక్క పొందవచ్చు. మొక్కధర 200 రూపాయలు ఉండగా ప్రభుత్వం 180 రూపాయల సబ్సిడీ అందిస్తోంది. ఆయిల్‌పామ్ మొక్కలు పెంచాలనుకునే రైతులు ధ్రువపత్రాలతో వ్యవసాయశాఖ అందికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

తక్కువ పెట్టుబడితో ఆయిల్ పామ్ తోటలు పెంచవచ్చు

- గొర్ల పరమేశ్వర్, రైతు, బొమ్మనపల్లి

అన్ని పంటలకన్నా అయిల్ పామ్ తోటలు తక్కువ పెట్టుబడితో పెంచవచ్చు. సాగునీటి కొరత ఉన్న ప్రాంతంలో ఈ మొక్కలు పెంచితే లాభదాయకం. అధికారులు రైతులకు మరింత అవగాహన కల్పించి అయిల్ పామ్ తోటలు పెంచేలా ప్రోత్సహించాలి.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

-జనవేని రాజమల్లు, రైతు, ఉల్లంపల్లి

సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉంటే అన్ని పంటల కన్నా ఆయిల్ పామ్ సాగు చాలా సులభం. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడి ఉంటుంది. కోతుల బెడద ఉండదు. పంటలకు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. అంతర పంటగా అన్ని రకాల పంటలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చు. పంట సాగుకు రైతులు ముందుకు వస్తే మార్కెటింగ్ సౌకర్యం ఉంటుంది.

చిగురుమామిడిలో రైతకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ మ్యాదరబోయిన ప్రవీణ్



అక్రమ కట్టడాల కూల్చివేత

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లో ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది కూల్చి వేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 669 ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాల మేరు మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ కనకరాజు, కార్యదర్శి లచ్చయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు.

రూ. 6,800 పలికిన పత్తి ధర


జమ్మికుంట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,800 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 196 మంది రైతులు 1,630క్వింటాళ్ల విడి పత్తి, 15 మంది రైతులు 26 క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,800 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు

తిమ్మాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై ఆర్టీసి బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన జింక మల్లేశం కరీంనగర్ వైపునకు తన ద్విచక్ర వాహనంపై వెలుతుండగా ఇందిరానగర్ వద్ద వెనుక నుంచి ఆర్టీసి బస్సు ఢీ కొట్టి వెళ్లిపోయింది. ద్విచక్ర వాహనం పైనుంచి మల్లేశం కిందపడటంతో గాయాలు కాగా స్థానికులు గమనించి కరీంనగర్ అనుపత్రికి తరలించారు.

తాళం పగులగొట్టి చోరీ

జమ్మికుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాకాలనికి చెందిన బోగం లక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. లక్ష్మి ఈ నెల 18న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంటి సమీపంలో ఉన్న కుమార్తెకు ఫోన్ చేసి ఇంటి వైపు చూడమని చెప్పింది. మంగళవారం ఉదయం ఇంటి తాళం తీసి ఉండటాన్ని గమనించిన కుమార్తె తల్లికి సమాచారం అందించింది. హుటాహుటిన వచ్చిన తల్లి ఇంట్లోకి వెళ్లి చూడగా, నగదు, వెండి, బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్లు గమనించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రవికుమార్ తెలిపారు.



ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కారుతో ఢీ కొట్టి.. కత్తితో పొడిచి..

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడి దారుణ హత్య - కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ధర్నా,

- హత్యకు రాజకీయ కక్షలే కారణమంటూ ఆరోపణ



మారు గంగారెడ్డి(ఫైల్)

జగిత్యాల క్రైం/జగిత్యాల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి(58) మంగళవారం దారుణ హత్యకు గురయ్యాడు. కారుతో ఢీ కొట్టి.. కత్తితో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశారు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలోని జగిత్యాలరూరల్ మండలం జాబితాపూర్‌లో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. జాబితాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ, జీవన్‌రెడ్డికి రాజకీయంగా అనుచరుడిగా పేరున్న మారు గంగారెడ్డి మంగళవారం ఉదయం గ్రామ కూడలిలో దారుణ హత్యకు గురయ్యాడు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న గంగారెడ్డిని అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్‌గౌడ్ అనే యువకుడు కారుతో వెనుకనుంచి ఢీ కొట్టాడు. అదుపు తప్పి కింద పడిన గంగారెడ్డిని అందరూ చూస్తుండడానే కత్తితో చాతితో పాటు కడుపులో విచక్షణా రహితంగా పొడిచాడు. అనంతరం వేరే కారులో తన అనుచరులతో కలిసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన గంగారెడ్డిని కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్య లోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జీవన్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని గంగారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు.

● మూడు గంటలకు పైగా ఆందోళన...

గంగారెడ్డి హత్య విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. హత్యకు ఇటీవల చేరిన కాంగ్రెస్ నాయకుడే కారణం అంటూ ఆరోపించారు. జగిత్యాల-ధర్మపురి ప్రధాన రహదారి ఇందిరా చౌక్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బైఠాయించి ఆందోళన చేపట్టారు. నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సైతం ధర్నాలో పాల్గొని పోలీసుల తీరుపై మండిపడ్డారు. దీంతో ఎస్పీ అశోక్‌కుమార్ రంగప్రవేశం చేసి విప్‌తో పాటు ఎమ్మెల్సీతో గంటకు పైగా మంతనాలు జరిపారు. హత్యకు పాల్పడ్డ నిందితుడిని పట్టుకుని శిక్షిస్తామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.

● దసరా పండుగ నుంచే స్కెచ్..

గంగారెడ్డిని హత్య చేసేందుకు అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్ దసరా పండుగ నుంచే స్కెచ్ వేసినట్లు గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటనలు చెబుతున్నాయి. గంగారెడ్డి గ్రామంలో ఏ సమస్య ఉన్నా పెద్ద మనిషిగా వ్యవహరించేవాడు. సంతోష్‌గౌడ్‌కు తన కుటుంబసభ్యులకు భూసమస్యలు ఉన్నాయి. ఈవిషయంలో గంగారెడ్డి పెద్ద మనిషిగా తనకు వ్యతిరేకంగా ఉన్నాడని కక్ష పెంచుకున్నట్టు తెలిసింది. అంతేకాకుండా ఇటీవల బతుకమ్మ, దసరా పండుగల వేడుకల్లో సైతం సంతోష్‌గౌడ్‌కు గంగారెడ్డికి మధ్య స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. ఇదే కారణంతో రాజకీయంగా గంగారెడ్డి ఉనికి లేకుంగా చేసేందుకు కొంతమంది స్కెచ్ వేసి సంతోష్ గౌడ్‌తో హత్య చేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● సీఎంవో, సీఎస్ దృష్టికి తీసుకెళ్లిన అడ్లూరి...

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారు గంగారెడ్డి హత్యకు గురైన సంఘటను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లారు. సీఎం కార్యదర్శితో పాటు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి కాంగ్రెస్ నాయకుడి హత్య గురించి వివరించారు. హత్య ఉదంతంపై పోలీసుల తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుడికి ప్రాణభయం ఉందనే విషయాన్ని పోలీసుల దృష్టికి ముందుగానే తీసుకెళ్లినా రక్షణ కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

● మీపార్టీకి.. మీకూ ఓ దండం..

కాంగ్రెస్ నాయకుడి హత్య విషయాన్ని తెలుసుకున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సమయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పీసీసీ చీఫ్‌పై అసహనం వ్యక్తం చేశాడు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితానికి కాంగ్రెస్ పార్టీ మంచి బహుమతి ఇచ్చిందన్నారు. 'మీ పార్టీకి... మీకు ఓ దండం అంటూ.. మీ పార్టీలో నేను ఇక ఉండనూ.. ఇకనైనా బతకనివ్వండి' అంటూ ఫోన్ కట్ చేశారు.

● హత్యను ఖండించిన ఎమ్మెల్యే సంజయ్ ..

కాంగ్రెస్ నాయకుడి హత్యపై హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందించారు. హత్యను తీవ్రంగా ఖండించారు. హత్యకు పూర్తి కారణాలు తెలుసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్‌ను ఆదేశించారు. నిందితులను, హత్యలో ప్రమేయం ఉన్న ఏఒక్కరినీ వదలొద్దని ఆదేశించారు. హత్యను రాజకీయకోణంలో చూడడం బాధాకరంగా ఉందన్నారు.

● వీఎస్ఎస్ చైర్మన్ నుంచి ...

జాబితాపూర్ గ్రామానికి చెందిన మారు గంగారెడ్డి కాంగ్రెస్ పార్టీలో మంచి కార్యకర్తగా గుర్తింపు తెచ్చుకున్నాడు. 40 ఏళ్ల కాలంలో వన సంరక్షణ సమితి అధ్యక్షుడి నుంచి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీతో పాటు జీవన్‌రెడ్డి ప్రధాన అనుచ రుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు.

ఇటీవల జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడి జాబితాలో గంగారెడ్డి పేరు కూడా ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

● పోలీసుల అదుపులో నిందితుడు?

గంగారెడ్డిని హత్యచేసి పారిపోయిన నిందితుడు బత్తిని సంతోష్ గౌడ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సంతోష్‌గౌడ్‌కు ఈ హత్యకు ఒక్కడికే సంబంధం ఉందా..? హత్యకు పాల్పడిన అనంతరం సంతోష్ గౌడ్ మరో కారులో పారిపోయిన సమయంలో మరో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నట్లు స్థానికులు అనుమానించడం వారికి సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. హత్య చేసిన అనంతరం నిందితుడు తన ఫోన్‌ను కొద్ది దూరంలో పడేసి వెళ్లడం.. హత్యకు కొద్దిరోజుల ముందు జగిత్యాలరూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న దృశ్యాలను రీల్ చేసి సోషల్ మీడియాలో పెట్టడం చూస్తుంటే ఈ హత్య పక్కా స్కెచ్ ప్రకారమే చేసినట్లు తెలుస్తోంది. హత్యకు పాల్పడ్డ నిందితుడు సంతోష్‌గౌడ్ పై రౌడీ షీట్ కేసుతో పాటు గంజాయి సేవిస్తూ జులాయిగా తిరిగే వ్యక్తిగా పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. హత్య సంచలనంగా మారగా పోలీసులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా భారీ బందోబస్తు నిర్వహించారు. జాబితాపూర్ గ్రామంతోపాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాల, ఇందిరా చౌక్‌కు భారీగా పోలీసులు మోహరించారు. డీఎస్పీ, సీఐ, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

ఆధార్, పాన్ కార్డ్‌లో ఫొటో మార్ఫింగ్

- బ్యాంకులో రూ. 20 లక్షల రుణం
- సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడి ఆవేదన



ఫేక్ డాక్యుమెంట్స్ చూపుతున్న నారాయణ

బుగ్గారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధార్, పాన్‌కార్డులోని తన ఫొటోలను మార్ఫింగ్ చేసి కేటుగాళ్లు బ్యాంకులో రూ. 20లక్షల రుణం తీసుకున్నారని ఓ బాధితుడు రెండు రోజుల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. బుగ్గారం మండలం మద్దునూరు గ్రామానికి చెందిన రైతు ముంజాల నారాయణ జగిత్యాలలోని ఓ బ్యాంకులో పంట రుణం కోసం వెళ్లాడు. బ్యాంకు అధికారులు మీ పేరు మీద హైదరాబాద్‌లో ఏడు ప్రైవేటు బ్యాంకుల్లో సుమారు రూ. 20లక్షల రుణం ఉన్నట్లు చెప్పడంతో అవాక్కయ్యాడు. ఆయా బ్యాంకులకు వెళ్లి ఆరా తీయగా తన ఆధార్, పాన్ కార్డులోని ఫొటోలను మార్ఫింగ్ చేసి రుణం తీసుకున్నట్లు తేలింది. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను బాధితుడు కోరాడు. బాధితుడు నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం హైదరా బాదు నుంచి ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులు నారాయణకు తరచుగా కాల్ చేసి క్రెడిట్ కార్డు బిల్లు రూ. 4 లక్షలు కట్టాలని ఒత్తిడి చేసేవారు. తాను ఎలాంటి లోన్ తీసుకోలేదని హెచ్చరించడంతో అప్పటి నుంచి కాల్స్ చేయడం మానేశారు. నాలుగు నెలల నుంచి మళ్లీ బ్యాంక్ నుంచి కాల్స్ రావడంతో ఇతరులకు సంబంధించిన ఫోన్లు తనకు వస్తున్నాయేమో అని నారాయణ అపోహ పడి అధికారులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిన సమయంలో నారాయణకు పంట రుణం మాఫీ కావడంతో జగిత్యాలలోని కెనరా బ్యాంకులో క్రాప్ లోన్ కోసం వెళ్లడంతో అసలు విషయం బయటపడింది. నారాయణ పేరుమీద అప్పటికే రూ. 20 లక్షల లోన్ ఉందని, వాటికి సంబంధించిన కిస్తీలు కడ్డటం లేదని బ్యాంకు అధికారులు తెలపడంతో నారాయణ అవాక్కయ్యాడు. వెంటనే జగిత్యాలలోని సైబర్ క్రైమ్ వారికి ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని దీనితో గత సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. స్పందించిన కలెక్టర్ సైబర్ క్రైమ్ వాళ్లకి రిఫర్ చేశారని బాధితుడు నారాయణ తెలిపాడు.

హెల్మెట్ ఉండదు... ట్రాఫిక్ రూల్స్ పాటించరు

- ప్రమాదాలబారిన ద్విచక్రవాహనదారులు
- రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే బాధితులు
- దిక్కుతోచని స్థితిలో కుటుంబాలు



హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో తమ జీవితాలతో పాటు కుటుంబాలను అంధకారంలోకి నెడుతున్నారు. ముఖ్యంగా యువత వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలుకొని తెచ్చుకుంటున్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎక్కువ మంది జీవితాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో అధికశాతం ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారే అధికంగా ప్రమాదాలు బారిన పడుతుండటంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరుగుతోందని పోలీసులు చెపుతున్నారు.

మచ్చుకు కొన్ని...

➡ ఈ నెల 21న తుమ్మనపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ బ్రిడ్జీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మెన్ హెల్మెట్‌ను ధరించకపోవడం మూలంగా తలకు బలమైన గాయం కావడంతో అక్క డికక్కడే మృతి చెందాడు.

➡ హుజూరాబాద్ మండలం శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ స్టేజి వద్ద హుజూరాబాద్ పట్టణంలోని మర్బుల్ షాపు యాజమాని, ఆర్‌ఎంపీ వైద్యుడు ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్న క్రమంలో యూటర్న్ వద్ద ఎదురుగా మరో వాహనం రావడంతో వాహనం అదుపు తప్పింది. సదరు వ్యక్తి హెల్మెట్ ధరించకపోవడంతో తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందాడు.

➡ హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి ద్విచక్ర వాహనదారుల మృత్యువులకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంది. ఎన్‌హెచ్‌ఐ-563 పనుల కోసం వచ్చిన ఉపాధి హామీ కూలీలిద్దరూ తమ సొంత ఊరికి వెళ్లి తిరిగి పనులు జరిగే చోటికి అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో వాహనం నడుపుతున్న వ్యక్తి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ● తుమ్మనపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు విధుల్లో పాల్గొనేందుకు హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై బయల్దేరగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొ ట్టడంతో తల భాగానికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబం రోడ్డున పడింది.

ప్రమాద బీమాపై అవగాహన కరువు

రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో చాలా మంది జీవితాలే అర్ధంతరంగా ముగుస్తున్నాయి. దీంతో వారి కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కుటుంబ పోషకుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబ సభ్యుల పరిస్థితి అగమ్యగోచారంగా మారుతుంది. వాహనలు నడిపే ప్రతి వ్యక్తి బాద్యతగా ప్రమాద బీమా తీసుకుంటే ప్రమాదవశాత్తు మరణించినా.. అంగవైకల్యం వచ్చినా బీమా ఆదుకునే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రవేశపెట్టిన బీమా పథకాలపై అవగాహన లేక వాటిని కోల్పోతున్నారు.



కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న ద్విచక్రవాహనదారులు (ఫైల్)

ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలి

- కంచె వేణు,ఎంవీఐ, హుజూరాబాద్



వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడం ద్వారా ప్రమాదాలు జరిగే అస్కారం చాలా తక్కువ. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు బయటికి తీస్తున్న క్రమంలోనే హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరిస్తే.. అనుకొని ప్రమాదం ఏర్పడితే హెల్మెట్ ద్వారా తలభాగాన్ని కాపాడుకోవచ్చు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువతి మృతి

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వట్టివాగు వద్ద ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయలై చికిత్స పొందుతున్న కోరుట్ల పట్టణానికి చెందిన నీలం హిమశ్రీ(22) అనే యువతి సోమవారం రాత్రి మృతి చెందింది. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న నీలం ప్రవీణ్ తన కూతురు హిమశ్రీని బైకుపై ఎక్కించుకోని మెట్‌పల్లి వస్తున్నాడు. పట్టణ శివారులోని వట్టివాగు వద్ద బ్రిడ్జిపై మెట్‌పల్లి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో ఇద్దరిరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హిమశ్రీ సోమవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు, లారీ డ్రైవర్లపై కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): అప్పులు, కుటుంబ కలహాలతో నేత కార్మికుడు మానేరు వాగులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన ఆడెపు తిరుపతి (40) తంగళ్లపల్లిలోని మానేరు వంతెన పైనుంచి వాగులోకి దూకే ప్రయత్నం చేస్తుండగా భార్య అడ్డుకుంది. ఘటనను అటువైపుగా వెళ్తున్న వాహనాదారు గమనించి తిరుపతిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిపై దాడికి దిగడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు తిరుపతికి నచ్చజెప్పి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పులు, కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించినట్లు తిరుపతి పోలీసులకు తెలిపాడు. కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఏఎస్సై చంద్రమౌళి తెలిపారు.

'శాతవాహన' సమాచారం

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను
రెగ్యులర్ కోర్సులుగా మార్చాలి

- ఎస్‌యూ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల చైతన్య



వీసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్‌యూ జేఏసీ నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని, పీహెచ్‌డీ ప్రోగ్రాంను ప్రారంభించాలని, కొత్త కోర్సులకు అవకాశం కల్పించాలని ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్‌ను మంగళవారం శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల చైతన్య కోరారు. నూతనంగా శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతిగా నియమితులైన ప్రొఫెసర్ ఆచార్య ఉమేష్‌కుమార్‌ని శాతవాహన జేఏసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులుగా మార్చి నూతన కోర్సులను తీసుకువచ్చి పీహెచ్‌డీ ప్రోగ్రాంను ప్రారంభించాలన్నారు. అలాగే యూనివర్సిటీని పటిష్టం చేయాలని కోరారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరారు. దీనికి వీసీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌యూ జేఏసీ నాయకులు శనిగారపు అరుణ్ కుమార్, నైతం మహేష్, సత్యనారాయణ, రమేష్, తిరుపతి, అనిల్, శ్రీకర్, రవి పాల్గొన్నారు.

29 నుంచి బీఫార్మసీ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలో బీఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29వ తేదీ నుంచి, మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు 30నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు (సప్లిమెంటరీ) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ((రెగ్యులర్, సప్లిమెంటరీ) మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఎమ్మెస్సీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబరు 2024లో నిర్వహించిన ఎంఎస్సీ రెండో, నాలుగో సెమిస్టర్ గణితం (బ్యాక్‌లాగ్) పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఈ ఫలితాలు శాతవాహన వెబ్సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నేటి నుంచి ఎస్‌యూ అంతర డిగ్రీ కళాశాలల క్రీడా పోటీలు

● షెడ్యూల్‌ను ప్రకటించిన స్పోర్ట్స్ బోర్డు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్ అంతర డిగ్రీ, పీజీ కళాశాలల క్రీడా పోటీల షెడ్యూల్ బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ మేరకు శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ క్రీడా షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ క్రీడా పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను శాతవాహన యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన శాతవాహన యూనివర్సిటీ జట్టు దక్షిణ భారత అంతర యూనివర్సిటీ క్రీడా పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో క్రీడాంశాల్లో పోటీలతోపాటు ఎంపికలను నిర్వహించనున్నారు. మిగతా క్రీడాంశాల్లో నేరుగా ఎంపికలను నిర్వహిస్తామని ప్రకటించారు.

● క్రీడల షెడ్యూల్ ఇలా..

ఈ నెల 23న శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలను పురుషుల విభాగంలో నిర్వహిస్తారు. 24న శాతవాహన యూనివర్సిటీ కళాశాల మైదానంలో మహిళలకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తారు. 25న కరీంనగర్ కార్ఖానగడ్డలోని డైనమిక్ జిమ్‌లో మహిళలకు, పురుషుల విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 26న కరీంనగర్ లారా జూడో అకాడమీలో మహిళలు, పురుషుల విభాగాల్లో జూడో క్రీడాంశంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. నవంబర్ 1న కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళలు, పురుషుల విభాగాల్లో ఆర్చరీ అంశంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 2న శాతవాహన యూనివర్సిటీ మైదానంలో మహిళల విభాగంలో వాలీబాల్ క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. 4న కరీంనగర్ వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల క్రీడా మైదానంలో పురుషుల విభాగంలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తారు. 6న శాతవాహన యూనివర్సిటీ మైదానంలో పురుషుల విభాగంలో ఖో-ఖో పోటీలను, 7న మహిళల విభాగంలో ఖో-ఖో పోటీలను నిర్వహించనున్నారు. 13న శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో మహిళలు, పురుషుల విభాగంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 14న యూనివర్సిటీలో క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తారు.



చారిత్రక ఖిల్లా

పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు మనసుకు నూతనోత్తేజాన్ని అందించడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలో గల చారిత్రక ఖిల్లా కూడా పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ఆలోచింపజేస్తోంది. జగిత్యాల పట్టణంలోని కోట, తెలంగాణ టూరిజం మ్యాప్‌లో మెరిసే నక్షత్రంగా ఖిల్లా గుర్తింపు పొందింది. వందల ఏళ్ల నాటి కట్టడం చెక్కు చెదరకుండా ఉండటం విశేషం. ఖిల్లా కారణంగానే జగిత్యాలకు ఆ పేరు వచ్చిందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

- టూరిజం మ్యాప్‌లో మెరిసే నక్షత్రం
- ఐరోపా కోటతో పోలికలు
- రాష్ట్రంలో ఉన్న ఏకైక నక్షత్రాకారం కోట
- శత్రుదుర్భేద్యంగా ప్రత్యేక గదులు, కందకాలు, బావి, సొరంగం
- పర్యాటక శాఖ ఆదరిస్తే మరింత గుర్తింపు


జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో చారిత్రక కట్టడమైన జగిత్యాల ఖిల్లాను క్రీ.శ 1747లో ఎలగందుల కోటకు అధిపతిగా ఉన్న ముబారీ జాల్‌ముల్క్ జాఫరుదౌలా, మీర్జా ఇబ్రహీంఖాన్ 20 ఎకరాల విస్తీర్ణంలో ఖిల్లాను నిర్మించారు. 17వ శతాబ్దంలో ఇద్దరు యూరోపియన్ ఇంజనీర్లు జాక్, తాల్ ఈ ప్రాంతంలో నీటితో చుట్టుముట్టబడిన ఒక అందమైన నక్షత్ర ఆకారపు కోటను నిర్మించారు. ఈ ఇద్దరు ఇంజనీర్ల పేర్లు అయినా జాక్, తాల్ ప్రేరణ పొందిన ఈ ప్రదేశం తరువాత జగిత్యాల అని పిలిచేవారని స్థానికులు అంటున్నారు. ఈ కోట జాక్ తాల్ కోటగా ప్రసిద్ధి చెందింది. జగిత్యాల కోట రాయి సున్నంతో కట్టబడిన నక్షత్ర ఆకారపు డిజైన్‌లో ఉంటుంది. చుట్టూ లోతైన కందకం ఉండి ఆ కందకం ఇప్పటికీ నీటితో నిండి ఉంటుంది. 277 సంవత్సరాలు గడిచినా కోట చెక్కు చెదరలేదు. కోటలో నిర్మించిన కోనేరు ఎప్పటికీ నీటితో కలకల్లాడుతూనే ఉంటుంది. కోట లోపల మందుగుండు సామగ్రి నిల్వ చేసుకోవడానికి నిర్మించిన గదులున్నాయి. ఈ గదుల సమీపంలో వెనుక ద్వారం ఉందంటున్నారు.

● నక్షత్ర ఆకారపు కోట...

రాష్ట్రంలో నక్షత్ర ఆకారపు కోటగా జగిత్యాల ఖిల్లా గుర్తింపు పొందింది. మొఘల్ రాజవంశంలో గవర్నర్ నవాబ్ ఇబ్రహీం హయాంలో దీనిని నిర్మించారు. కోటకు రెండు చెక్క ద్వారాలు ఉన్నాయి. మొఘల్ సార్వభౌమాధికారంలో గవర్నర్ నవాబ్ ఇబ్రహీం పాలనలో నిర్మించబడిన ఈ కోట అత్యంత శక్తివంతమైన రాజవంశం ముద్రను కలిగి ఉంది. ఇది 264 మీటర్ల ఎత్తులో నిర్మించబడింది. దాని చుట్టూ మోతే చెరువు, ధర్మ సముద్రం చెరువు, ముపారపు, కండ్లపల్లి చెరువు అనే నాలుగు నీటి వనరులు ఉన్నాయి. కోట ప్రాంగణం అంతటా చెల్లాచెదురుగా ఉన్న భారీ ఫిరంగుల ఉనికి ద్వారా కోట అజేయంగా ఉన్న రోజులను ఇప్పటికీ గుర్తుచేస్తుంది. విదేశీ ప్రభావం కారణంగా ఈ కోట ఐరోపా కోటతో బలమైన పోలికను కలిగి ఉందన్న అభిప్రాయాలున్నాయి. జగిత్యాల ఖిల్లా ప్రత్యేక ఆకృతి, నిర్మాణం పలువురిని ఆకర్షింపజేస్తోంది. పాఠశాల, కళాశాల విద్యార్థులతో జిల్లాలో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసి పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఇటీవల ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మూడో బహుమతి దక్కింది. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, పర్యాటక శాఖ అధికారులు ఖిల్లా అభివృద్ధిపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



జగిత్యాల ఖిల్లా





నక్షత్ర ఆకారంలో నిర్మించిన కోట వ్యూ

మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

- నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అతిథులు

గణేశ్‌నగర్,అక్టోబర్ 22:(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. మై భారత్- నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో మంగళవారం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్నటువంటి సమస్య అని అందులో మనదేశం కూడా ఉందన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన అంశమని యువత దీనికి అలవాటు పడితే భవిష్యత్తు పాడవుతుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు, డ్రగ్స్ వినియోగంలో యువత శాతం ఎక్కువగా ఉంటుందని అలాంటి వారితో దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ తీసుకునే వారి మానసిక స్థితి సరిగ్గా ఉండదని అలాంటప్పుడు వివిధ నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని అన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వాడితే తమ టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ నాగార్జున, శ్రీనివాస్, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్, ఎం వెంకట్ రాంబాబు, డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ నెహ్రూ యువ కేంద్రం, రాములు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎక్సైజ్ శాఖ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ సైకాలజిస్ట్ జక్కని రాజు మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత ఎదుర్కొంటున్న వివిధ మానసిక సమస్యలు, నివారణ గురించి వివరించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టు అంజనేయ స్వామి ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలిరాగా స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షిం చారు.



ఆలయ ఆవరణలో భక్తులు

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు

గణేశ్‌నగర్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రాంనగర్‌లోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం అవుతున్నట్లు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు శిక్షణ కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించి మీ పేర్లు నమోదు చేసుకోగలరని తెలిపారు. నైపుణ్య శిక్షణకు అర్హులు ఏడవ తరగతి ఆ పైబడిన తరగతి పాసైన, ఫెయిల్ అయిన 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులని తెలియజేశారు. మూడు నెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇస్తామన్నారు. కోర్సు ఫీజు వివరాలు కంప్యూటర్ (ఎమ్మెస్ ఆఫీస్, డీటీపి)కి వెయ్యి రూపాయలు, బ్యూటీషియన్ కోర్సుకు 1500 రూపాయలు ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 9640967943, 9949850360 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హైబ్రిడ్ వంగడాలపై అవగాహన

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు హైబ్రీడ్ వరి వంగడాలు, వాటి ఉత్పాదకతపై వ్యవసాయ సంచాలకుల కార్యాలయం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కరీంనగర్ మండలం చామనపల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ రాజు, వరి శాస్త్రవేత్త డాక్టర్ వీరన్నలు అవగాహన కల్పించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మహేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సత్యం, ఏఈవోలు సుచరిత, స్వర్ణలత, ఉదయ్, మైడితల్లి, డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు వరి వంగడాలు, ఉత్పత్తులు, పత్తి సాగుపై అవగాహన కల్పించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కమాన్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనంది జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న 39వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా కోచ్ రమేష్, రవీందర్ తదితరులు అభినందనలు తెలిపారు.



ఆనంది

గ్రామోద్యోగ్ వికాస్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

- కేవీఐసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్ లతాదేవి



మాట్లాడుతున్న ఎన్ లతాదేవి

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ, చిన్న తరహా సంస్థల పరిధిలో గల ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న గ్రామోద్యోగ్ వికాస్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేవీఐసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్ లతాదేవి అన్నారు. మంగళవారం పట్టణంలోని గోవిందుపల్లిలో గల వీకేబీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన విలేజ్ ఇండస్ట్రీస్ అక్టివిటీస్ గ్రామోద్యోగ వికాస్ యోజన 2024-25 కార్యక్రమంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ డీజీ ప్రసాద్‌శర్మ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎన్ లతాదేవీ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ అంజనాదేవీ పలు అంశాలను వివరించారు.

ఈ సందర్భంగా సీనియర్ ఎగ్జిక్యూటివ్ లతాదేవీ మాట్లాడుతూ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ దేశవ్యాప్తంగా ఉమ్మడి సౌకర్యాలు, సాంకేతిక అధునికీకరణ, శిక్షణ మొదలైన వాటిని అందించడం ద్వారా గ్రామ పరిశ్రమల ప్రోత్సాహం, అభివృద్ధి కోసం గ్రామోద్యోగ్ వికాస్ యోజనను అమలు చేస్తుందన్నారు. 2024-25 సంవత్సరా నికి పథకం కింద అర్హత ఉన్న వ్యక్తులకు అందించడానికి అవసరమైన పనులు చేస్తున్నామన్నారు. ఇందులో శిక్షణ, సాధనాలను అందించడం జరుగుతుంద న్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని అర్హులైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు చేతి వృత్తులకు చెందిన వ్యక్తులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, చిన్న వ్యాపారులు పాల్గొన్నారు.

మూడు జాముల కొదురుపాక



గుట్టల మధ్య ఉన్న కొదురుపాక గ్రామం

- సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో తేడా
- 'గుట్టల' కారణంగానే ప్రత్యేక గుర్తింపు

తెలంగాణలోని పల్లెల్లో సూర్యోదయం, సూర్యాస్తమయం ఇంచుమించు ఒకే సమయంలో ఉంటాయి. సాధారణంగా ఉదయం ఆరు గంటలకు సూర్యోదయం అయితే, సాయంత్రం ఆరు గంటలకు సాయంత్రం అవుతుంది. కానీ తమ గ్రామంలో మాత్రం ఒక గంట ఆలస్యంగా సూర్యోదయం అవుతుంది. అలాగే మధ్యాహ్నం మూడునాలుగు గంటలకే తమ గ్రామంలో సూర్యాస్తమయం అవుతుందని ఆ ఊరి ప్రజలు చెబుతారు. అదే తమ గ్రామ ప్రత్యేకత అంటూ గర్వంగా చెప్పుకుంటారు.

సుల్తానాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా తెలంగాణలోని పల్లెల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అంటూ నాలుగు జాములను చెబుతారు.. కానీ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలో మూడు జాములే ఉంటాయి. కానీ అందరూ నాలుగో జాము చూసే సమయంలో ఆ గ్రామ ప్రజలు రాత్రిని చూస్తున్నారు. ఇలా ఆ గ్రామ ప్రజలు మూడు జాముల(ఉదయం, మధ్యాహ్నం, రాత్రి)కే పరిమితమవుతున్నారు. ఈ గ్రామం చుట్టూ పెద్దపెద్ద గుట్టలు ఉండడమే ఇందుకు కారణం... సుమారు 2వేల జనాభాగల కొదురుపాక గ్రామం 'మూడు జాముల కొదురుపాక' గానే ప్రపంచానికి తెలుసు.. అన్ని గ్రామాల్లో కంటే విభిన్నంగా గంట ఆలస్యంగా ఇక్కడి ప్రజలు సూర్యోదయాన్ని చూస్తారు. అంతటా సాయంత్రం ఆరు, ఏడు ప్రాంతంలో చీకట్లు అలుముకుంటే ఈ గ్రామంలో మాత్రం మధ్యాహ్నం మూడు, నాలుగు గంటలకే చీకటి పడుతుంది. పనుల మీద ఎవరైనా ఎక్కడికైనా వెళితే రంచనుగా ఇంటికి చేరుకుంటారు. కారణం.. కొదురుపాక గ్రామం చుట్టూ నాలుగు వైపులా ఎత్తయిన గుట్టలు ఉన్నాయి. తూర్పున గొల్ల గుట్ట, పడమరన రంగనాయకుల గుట్ట, దక్షిణాన పాము గుట్ట, ఉత్తరాన నంబులాద్రి గుట్టలు ఉన్నాయి. వీటి మధ్య కొదురుపాక గ్రామం ఉంది. సూర్యుడు ఉదయించే సమయంలో గొల్లగుట్ట అడ్డుగా ఉండడం వల్ల గంట పాటు సూర్యోదయం ఆలస్యంగా అవుతుంది. అలాగే సూర్యుడు అస్తమించే పడమర వైపున రంగనాయకుల గుట్ట అడ్డుగా ఉండటంతో మధ్యాహ్నం మూడునాలుగు గంటలకే గ్రామం చీకటిమయం అవుతుంది. ఇలా మూడు జాములకే పరిమితం అవడం వల్ల ఈ గ్రామానికి 'మూడు జాముల కొదురుపాక'గా గుర్తింపు వచ్చింది.




తూర్పున ఉన్న గొల్లగుట్ట



పడమరన ఉన్న రంగనాయకుల గుట్ట

గంట ఆలస్యంగా సూర్యోదయం..

-చాతరాజు రమేష్, యువకుడు, కొదురుపాక



మా గ్రామానికి తూర్పున ఉన్న గొల్లగుట్ట వల్ల సూర్యోదయం గంట ఆలస్యంగా అవుతుంది. అలాగే పడమర వైపున ఉన్న రంగనాయకుల గుట్టవల్ల సూర్యుడు పడమటి వైపు వెల్లగానే చీకటి అలుముకుంటుంది. ఇలా మా గ్రామానికి 3 జాములే ఉన్నాయి. అదే మా గ్రామ పేరుకు జతగా నిలిచి మూడుజాముల కొదురుపాకగా పేరుతెచ్చుకుంది. గుట్టల నడుమ గ్రామం ఉండటం వల్ల నాలుగో జామును ఇక్కడి ప్రజలు చూడలేకపోతున్నారు.

సీఐటీయూ కార్యవర్గం

మల్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల శాఖ కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా నాయకుల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోరెపు మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా ముప్పారపు పోచయ్య, ఉపాధ్యక్షులుగా గసిగంటి శ్రీను, కోశాధికారిగా బోనాల మల్లేశం, ప్రచార కార్యదర్శిగా మల్యాల మహేశ్, గౌరవాధ్యక్షులుగా మ్యాక దేవమ్మలతో పాటు సభ్యులను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోమటి చంద్రశేఖర్, పులి మల్లేశం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు పంచాయితీ కార్మికులకు వెంటనే చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

రాయికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామల్ల వేణు, కాటిపెల్లి గంగారెడ్డి, కంటె విష్ణు, గ్రామ సేవా సమితి అధ్యక్షుడు నల్ల గంగారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ చందా రాధ, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, ఆయాలు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రాయికల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని పశువులకు మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు మండల పశు వైద్యాధికారి నరేష్ రెడ్డి తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సుమారు 370 పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ కట్కం రమేష్, కార్యాలయ సహాయకులు షేక్ అహ్మద్, పోచయ్య, రైతులు రాజేష్, ప్రవీణ్, కొప్పెల గంగారాం, గణేష్, చెల్కల భీమన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఉన్నా.. బస్సు సౌకర్యం కరువాయె..

●దశాబ్దాలు గడుస్తున్నా బస్సు సౌకర్యానికి నోచుకోని పల్లెలు ●మహిళలకు అందని ఉచిత బస్సు సౌకర్యం

కొడిమ్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలు గడిచినా పల్లెల దశ తిరగటం లేదని తమ పల్లెకు ఆర్టీసీ బస్సులు రావటం లేదని పల్లె ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కలిపించి అమలు చేస్తుండగా మండలంలోని పలు పల్లెల మహిళలు మాత్రం ఉచిత బస్సు ప్రయాణానికి నోచుకోవటంలేదు. మండలంలోని పూడూర్ నుంచి నర్సింహులపల్లి వరకు కోటీ 60 లక్షల రూపాయలతో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డాంబర్ రోడ్డు నిర్మించారు. అదే రూట్‌లో ఆర్టీసీ బస్సులు నడవక పోవటంతో గౌరాపూర్, నర్సింహులపల్లి గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొడిమ్యాల నుంచి చింతల్లపల్లి మీదుగా రాంసాగర్ వరకు కోటి రూపాయలతో రోడ్డు నిర్మించినా తాత్కాలికంగా ఆర్టీసీ బస్సును నడిపి ప్రయాణికులు రావటం లేదనే సాకుతో బస్సును నిలిపి వేశారు. దీంతో చింతల్లపల్లి, హిమ్మత్‌రావుపేట, రాంసాగర్ గ్రామస్తులు ప్రైవేటు వాహనాల మీద ఆధారపడి కొడిమ్యాల గ్రామానికి వివిధ పనుల నిమిత్తం వస్తూ పోతుంటారు. శ్రీరాములపల్లి గ్రామం నుంచి తిప్పయ్యపల్లి గ్రామం వరకు 90లక్షల రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్డు ఏర్పాటు చేసినా ఆర్టీసీ బస్సులను అధికారులు నడపటం లేదు. దీంతో నల్లగొండ, తిప్పయ్యపల్లి, శ్రీరాములపల్లి, నమిళికొండ గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం ప్రైవేటు వాహనాల మీదనే ఆదార పడి ప్రయాణం చేస్తుంటారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వాహనాల యజమానులు ప్రయాణికుల నుంచి బస్ చార్జీలకన్న అదనంగా వసూలు చేస్తున్నారని పల్లె ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలోనే మీ పల్లెకు అన్ని సౌకర్యాలతో పాటు ఆర్టీసీ బస్సులను కూడ నడిపిస్తామన్న నేతల మాటలు నీటిమీది రాతలేనని బస్సులు నడవని పల్లె ప్రజలు, నిత్యం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రజల సంక్షేమం కోరే పల్లెలకు ఆర్టీసీ బస్సులను నడపాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.



శ్రీరాములపల్లి నుంచి తిప్పయ్యపల్లికి వేసిన రోడ్డు

బస్సు సౌకర్యం కల్పించాలి

చల్ల శ్రీనివాసరెడ్డి మాజీ ఇన్‌చార్జి సర్పంచు, శ్రీరాములపల్లి



పల్లెలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ప్రభుత్వం కలిపించాలి. బస్సులు నడవని కారణంగా ఇబ్బందుల పాలవుతున్నాం. ఆర్థికంగా నష్టపోతున్న పల్లె మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కలిపిస్తూ ఆర్థిక భారం మీద పడకుండ చూడాలి. ప్రైవేటు వాహన య జమానులు ప్రయాణికుల నుంచి అధిక మొత్తం వసూలు చేస్తూ దోచుకుంటున్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం



చెక్కు అందిస్తున్న పోలీసు అధికారులు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు సుబ్బరాజు కుటుంబానికి మెట్‌పల్లి పోలీసులు ఆర్థిక సహాయం అందజేశారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో మెట్‌పల్లి పోలీస్‌లు 50 వేలు జమచేసి బాధిత కుటుంబ సభ్యుల ఇంటి వద్దకు వెళ్లి వారికి 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ హోంగార్డు కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కా ర్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలి

వెల్గటూర్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో తక్షణమే ఉద్యోగ విద్య అవకాశాల్లో అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకనపల్లి సతీష్, ఉమ్మడి వెల్గటూర్ మండల అధ్యక్షుడు చెన్న కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వెల్గటూర్ మండలంలోని కిషన్రావుపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో ఉమ్మడి వెల్గటూర్ మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చెన్న కుమారస్వామి ఆధ్వర్యంలో ఈనెల 27న జగిత్యాల జిల్లాలో జరిగే ఎమ్మార్పీఎస్ ధర్మ యుద్ధ సభను విజయవంతం చేయడానికి సన్నాక సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జగిత్యాల జిల్లాలో నిర్వహించే ధర్మయుద్ధ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరవుతారని ఈ సభను విజయవంతం చేయడానికి వెల్గటూర్ ఉమ్మడి మండల వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు మేధావులు నిరుద్యోగులు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో మొదటగా అమలు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీని విస్మరించాలని ఇప్పటికే పలు రాష్ట్రాలలో సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా వర్గీకరణను అమలు చేస్తున్నారని తక్షణమే రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, ఎంఎస్పీ వైస్ ప్రెసిడెంట్ కిషన్, దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకనపల్లి సతీష్, ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షడు చిర్ర సతీష్, జిల్లా సీనియర్ నాయకులు గజ్జెల రాజేష్,మంతెన లక్ష్మణ్, స్వామి, బోయిని సతీష్, ఎల్లన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

5వ పేజీ తరువాయి..

తనిఖీలకు సిబ్బంది కొరత...

కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన ఆహారభద్రతా అ ధికారిణి జగిత్యాలలో సైతం విధులు నిర్వహిస్తున్నారు. ఆహార భద్రతా శాఖలో పలు పోస్టులు మంజూరు కాక పోవడం, ఉన్న పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల పర్యవే క్షణ కొరవడుతోంది. నిబంధనల ప్రకారం పట్టణాల్లో 50 వేల జనాభా, గ్రామీణ ప్రాంతాల్లో లక్ష జనాభాకు ఒక ఆహార భద్రతా అధికారి ఉండాలి. సిబ్బంది కొరతతో త నిఖీలు ఇబ్బందిగా మారాయి. దీనికితోడు ఎఫ్ఎస్ఎస్ఐ గుర్తింపు పొందిన ఎన్ఏబీఎల్ ల్యాబ్ లేకపోవడంతో న మూనాలను నాచారం పంపి పరీక్షలు చేస్తున్నారు. ఫలి తాలు రావడానికి ఆలస్యమవుతుండటంతో వెంటనే చర్య లు తీసుకోలేకపోతున్నారు.

స్పైసీ..రంగుల కోసం..

రోజురోజుకు పట్టణ, గ్రామీణ వాసులు ఆహారపు అల వాట్ల విధానం మారుతోంది. దీనిని ఆసరగా చేసు కొని కొందరు వ్యాపారులు కస్టమర్లను ఆకట్టుకునేందుకు యథేచ్ఛగా చైన్ సాల్ట్ (మోనోసోడియం గుటామేట్)ను వినియోగిస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపించేందుకు రసాయనాలతో తయారు చేసిన రంగులు కలిపివేస్తున్నారు. ఇవి రెండు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపు తున్నాయని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తోపుడు బండ్లపై విక్రయించే ఆహారం నుంచి హోటళ్లు, రెస్టా రెంట్లలో సరాఫరా చేసే ఆహారం వరకు అన్నీ అనుమానస్పదంగా ఉంటున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

అనూష, ఆహార భద్రత అధికారి , జగిత్యాల

ఆహార పదార్థాల తయారీ నిల్వ, విక్రయాల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. కొంతమంది నాసిరకం, కల్తీ ఆహార పదార్థాలు వినియోగిస్తుం డడం, హానికర రంగులు కలుపుతున్నట్లు తనిఖీల్లో గుర్తిస్తున్నాము. వారిపై కేసులు నమోదు చేశాం. కొన్ని కేసులు కోర్టుల్లో ఉన్నాయి. సిబ్బంది కొరత ఉన్నా ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి తగిన చర్యలు తీసుకుంటున్నాం.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదాపూర్ గ్రామంలోని భూమయ్య అనే లబ్ధిదారుకు రూ. 2లక్షల విలువగల చెక్కును మాజీ ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్‌లతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మంగళవారం అందించారు. భూమయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైద రాబాదులోని ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవల నయం అయి స్వంత ఇంటికి తీరిగి రాగ అతనికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు.

భూ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి నిర్మాణం కోసం చేస్తున్న భూ సేకరణ పనులను అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని చెర్లకొండపూర్ గ్రామ సమీపంలోని వడ్డెర కాలనీ వద్ద జాతీయ రహదారుల అథారిటీ అధికారులు చేస్తున్న సర్వేను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని, రోడ్డు నిర్మాణంలో రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా చేపట్టాలని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు, నివాసం ఉన్న వారు ఏర్పాటు చేసుకున్న వసతులపై ప్రభుత్వం నష్టపరిహారం కింద చెల్లించాల్సిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూమి, ఇండ్లు, కట్టడాలు, చెట్లు, బోర్లు, పైపులైన్లు, ఇతర నిర్మాణాలను పరిశీలించి, వాటికి చెల్లించాల్సిన నష్ట పరిహారం అంచన విలువలను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కలిసి చేయాలన్నారు.

ఇప్పటి వరకు చేపట్టిన సర్వేలో భూములు కోల్పోతున్న వారు తెలి పిన అభ్యంతరాలను పరిగణంలోకి తీసుకొని భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎదుర్కోవడం, అనుసరించాల్సిన విధానాలను వివ రించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఉమేష్, జాతీయ రహదారుల అధికార బృందం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి

ధర్మపురి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జ్వర సర్వేను పకడ్బందీగా నిర్వహించి, కాలానుగుణంగా వచ్చే వ్యాధుల నియంత్రణ కోసం సమర్థవంతంగా కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నీలారపు శ్రీనివాస్ సూచించారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల పీహెచ్‌సీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నీలారపు శ్రీనివాస్ ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలన్నారు. అనంతరం వ్యాక్సిన్ నిల్వలను తనిఖీ చేసి వాటిపై ఆరా తీశారు. స్టోర్స్‌లో కనీసం మూడు నెలలకు సరిపడే మందులు నిల్వ ఉంచాలని ఆయన ఆదేశించారు. ఆశావర్కర్స్‌కు దినచర్యల రిజిస్టర్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వివేక్, డాక్టర్ అనూష, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు ఎల్లంకి శ్రీనివాస్, శాంతిశ్రీ, హెచ్ఈవో సతీష్‌కుమార్, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, సులోచన, హేమలత, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



రిజిష్టర్‌లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్ ఏఎంసీ చైర్‌పర్సన్ పుష్పలత

మల్లాపూర్, అక్టోబరు, 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మల్లాపూర్ ఏఎంసీ చైర్మన్ అంతడుపుల పుష్పలత-నర్సయ్య, సొసైటీ చైర్మన్ నర్సారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న విక్రయించి కల్పిస్తున్న మద్ధతు ధర రూ. 2225ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాలకు వచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేప ట్టాలని అధికారులు, నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి



శివాలయ అభివృద్ధి పనులను ప్రారంభింస్తున్న చైర్మన్, నాయకులు

కోరుట్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల అభివృద్ధికి ప్ర భుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిదులు కేటాయిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామంలోని శివాలయం, ఆంజనేయ స్వామి, అయిలాపూర్‌లోని అంజ నేయ స్వామి, సంగెం గ్రామంలోని రామాలయం వద్ద భజన మందిర్ నిర్మాణంతో పాటు సంగెంలో గంగమ్మ దేవాలయం, కల్లూర్‌లో ఎల్లమ్మ దేవాలయాలకు టీటీడీ నుంచి మంజూరైన నిధులతో పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధికి నిదులు మంజూరికి కృషి చేసిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావులతో పాటు దేవాలయ శాఖ మంత్రి సురేఖ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో పాటు టీటీడీ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అయిలాపూర్ సింగిల్ విండో చైర్మెన్ సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ప్రియాంక - సురేష్, నాయకులు లింబాద్రీ, సత్యనారాయణ గౌడ్, యూసుఫ్‌నగర్ మాజీ సర్పంచ్ తుక్కారాం గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శిగా పాపయ్య

జగిత్యాల అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చెందోళి గ్రామానికి చెందిన సాయిని పాపన్న ఎంపికయ్యారు. ఈ మేరకు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య నియామక పత్రాన్ని పాపన్నను అందజేశారు. అలాగే రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా బీర్‌పూర్ మండలం కోమన్‌పెల్లి గ్రామానికి చెందిన సీపతి రమేష్, రైతు విభాగం సభ్యునిగా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన గురునాథం మల్లారెడ్డి ఎంపికైనట్లు జిల్లా అధ్యక్షుడు చదలు సత్యనారాయణ తెలిపారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకలు చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సూచించారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాలలో ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులు, సింగిల్ విండో చైర్మన్లు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం రైతులను విస్మరించి పని చేస్తుందని ఆరోపించా రు. చాల మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతు బందు ఎగ్గొట్టి రైతులను మో సం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు నర్సా రెడ్డి, జగన్‌మోహన్‌రావు, బండి భూమయ్య, అదిరెడ్డి, సర్పంచ్‌ల పోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, మాజీ సర్పంచ్‌లు బాస్కర్ రెడ్డి, వనతడుపుల అంజయ్య, ఐకేపీ ఏపీ ఎం శంకర్, పలు గ్రామాల రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కల్లూర్‌లో కొనుగోలు కేంద్రంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆరుగాలం కష్టం.. అడవి పందుల ధ్వంసం

ఆదుకోవాలని ప్రభుత్వానికి రైతుల వేడుకోలు



బట్టపల్లిలో ధ్వంసం అయిన పంటను చూపుతున్న రైతు

సారంగాపూర్, అక్టోబరు, 22 : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందే సమయంలో అడవి పందులు దాడి చేసి ధ్వంసం చేస్తుండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓవైపు పొద్దంతా కోతులు, పక్షుల నుంచి తమ పంటలను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు చీకటి పడితే చాలు అడవి పందులు మూకుమ్మడిగా వరి పంటలపై దాడి చేస్తూ పూర్తిగా ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికే రైతులు పెట్టుబడి పెట్టి అప్పుల్లో కూరుకు పోయారు. పంట చేతికంది అప్పులు తీర్చు తామనే ఆశతో ఉన్న రైతులకు నిరాశే మిగులుతోంది. మండలంలోని బట్టపల్లి, పోతారం, సారంగాపూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి, అర్పపల్లి గ్రామాల్లోని పందుల బెడద విపరీతంగా ఉంది. రైతులు తమ పంటలను రక్షించేందుకు మైకులు, అగ్ని మంటలను ఏర్పాటు చేసు కొని రాత్రి పొలం వద్దనే కునుకు తీస్తున్నారు. అయినా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు రైతుల బాదలను గుర్తించి నష్ట పోయిన రైతుల ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

రేపు బాల బ్రహ్మానంద సరస్వతిచే ప్రవచనాలు

ధర్మపురి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఆవరణలో గల శ్రీ శేషప్ప కళావేదికపై ఈ నెల 24 న గురువారం నైమివారణ్య పీఠాధిపతులు, బాల బ్రహ్మానంద సరస్వతిచే నరసింహ స్వామి పురాణం, విజ్ఞానం ప్రవచనాలు ఉంటాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు ప్రకారం ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో పీఠాధిపతు లు శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతిచే ప్రవచనాలు ఉంటాయని ఆయన పేర్కొన్నార. కావును భక్తులు అందరు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

కోరుట్లకు చేరుకున్న ఉద్యమకారుల పాదయాత్ర

కోరుట్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు ఓయు నేత, న్యాయవాది దాసర్ల శ్రీశైలం చేస్తున్న పాదయాత్ర మంగళవారం కోరుట్ల పట్టణానికి చేరుకుంది. ఆదిలాబాదు నుంచి హైదరాబాదు వరకు చెపట్టిన పాదయాత్ర కోరుట్ల పట్టణానికి చేరుకోగా ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు పేట బాస్కర్‌లతో పాటు స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం మాట్లాడారు. ఉద్యమ కారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నేరవే ర్చేవిధంగా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీన ప్రారంభించిన పాదయాత్ర 29వ వరకు హైదరాబాదుకు చేరుకుంటుందన్నా రు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు కృష్ణ ముదారాజ్, కేతురి శివన్న, గుండేటి రవి, శాలివాహన బాలచందర్, పద్మ నరేష్, శ్రీనివాస్, పెందురి మారుతి, మామిళ్ల లక్ష్మణ్, పాలకొండ దత్తు, అత్రం వినోద్, దాసరి విల్సాస్ దుర్గాం జగదీష్ పలువురు పాల్గొన్నారు.



ర్యాలీకి స్వాగతం పలుకుతున్న ప్రజాసంఘాల జేఏసీ నాయకులు

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ

కథలాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సమీయోద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ వారం చేపట్టే వ్యాధి నిరోధక టీకాలు, డ్రైడే వంటి కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ఎన్‌హెచ్ఎం పథకం కింద అమలవుతున్న పథకాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఆరోగ్య మహిళపై ప్రత్యేక దృష్టి సారించి పరీక్షలు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సింధూజ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ రాజయ్య, ఫార్మాసిస్టు సుజాత, సిబ్బంది ఉన్నారు.

వ్యాధి నివారణ టీకాలపై అపోహలు పెట్టుకోవద్దు

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 22 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాలకు వ్యాధులు సోకకుండా ముందస్తుగా వేయించే వ్యాధి నివారణ టీకాలపై రైతులు అపోహలు పెట్టుకోవద్దని మండల వైద్యాధికారి డాక్టర్ మనీషా పటేల్ సూచించారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని విట్టంపేట, ఆరపేట గ్రామాల్లోని మూగజీవాలకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసి రైతులకు అవగాహన కల్పించారు. పశు వైద్యాధికారులు రమ, రమణయ్య, ఖాజా, చిరంజన్, మోహన్, దిలీప్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కథలాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకుంటలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. నల్లూరి జలజకు రు. 60 వేలు, ఉత్కంజలకు రు. 18,500ల చొప్పున మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజే శారు. ఈ సందర్భంగా నాయకులు చెదలు సత్యానారాయణ, బైర మల్లేశ్, ఉన్నారు.

మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరణ

పెగడపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి ఎంఈవోగా సులోచన దేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మండల విద్యాశాఖ అధికారిగా నామాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులో చన దేవికి పూర్తి స్థాయి అదనపు ఎంఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.